సూచికలు లేవు.. ప్రమాదాలు ఆగవు



ప్రమాదాలకు అడ్డాగా మారిన మైలగడ్డ స్టేజీ సమీపంలోని మలుపు

- గద్వాల– రాయచూర్ రహదారిలో పెరుగుతున్న ప్రమాదాలు
- మలుపుల వద్ద సూచికలు కరువు
- పట్టించుకోని అధికారులు



మైలగడ్డ– అల్లపాడు రోడ్డులోని మలుపు

కేటీదొడ్డి: గద్వాల– రాయచూర్ ప్రధాన రహదారి వెంట ఉన్న ఆయా గ్రామాల స్టేజీల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలకు నిలయంగా మారాయి. గద్వాల నుంచి మొదలుకొని కేటీదొడ్డి మండలంలో నందిన్నె వరకు దాదాపు ఏడు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింక్ రోడ్ల వద్ద గ్రామాలను సూచిక బోర్డులు, మలుపులను సూచించే బోర్డులు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

ఇవీ మలుపులు

గద్వాల నుంచి రాయచూర్ వైపునకు వెళ్లే మార్గంలో గద్వాల మండలం సంగాల స్టేజీ సమీపంలో మలుపు ప్రమాదకరంగా ఉంది. ధరూరు మండలంలో పెట్రోల్ బంకు, మూడు రోడ్ల కూడలి, బురెడిపల్లి, ర్యాలంపాడు, ప్రధాన కాల్వ వద్ద కేటీదొడ్డి మండలం మైలగడ్డ స్టేజీ వద్ద, ఉమిత్యాల స్టేజీ తదితర ప్రాంతాల్లో వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

సూచికలు కరువు

రాయచూర్ రహదారి నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రాంతాలకు గ్రామాలను సూచించే ఊరి పేర్ల బోర్డులు, ఎత్తుపల్లాలను సూచించే సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తపాలెం స్టేజీ సమీపంలో గతేడాది కోతులగిద్దె గ్రామానికి చెందిన రంగన్న పొలం నుంచి వస్తు తాయమ్మ మిట్ట వద్ద ప్రమాదానికి గురై మృతి చెందాడు. అదే విధంగా కేటీదొడ్డికి చెందిన నర్సింహులు మైలగడ్డ స్టేజీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా వాసి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఇలా తరచూ మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూచికలు లేక ప్రమాదాలు



మా గ్రామానికి వెళ్లే మలుపు వద్ద సూచికలు లేవు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రాయచూర్, గద్వాల వైపు నుంచి వచ్చే వాహనాల వారు ఒకవైపు ఏటవాలు రోడ్డు కావడంతో స్పీడు ఎక్కువగా ఉంటుంది. ద్విచక్రవాహనదారులు మా గ్రామానికి తిరిగి వెళ్లే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
– పాండు, పాతపాలెం

ప్రతిపాదనలు పంపించాం

గద్వాల– రాయిచూర్ మార్గంతో పాటు ఇతర మార్గల్లోనూ కొంతమేర గ్రామాల పేర్ల బోర్డులు సూచికలు ఏర్పాటు చేశాం, కాని ఇంక అక్కడక్కడ లేని విషయమై ప్రభుత్వానికి నివేదికలు పంపించాం, నిధులు కూడా మంజురయ్యాయి త్వరలోనే ప్రతి స్టేజీ వద్ద పేర్ల బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
– రామకృష్ణ, ఆర్అండ్బీ ఏఈ

ఆలయాలకు రక్షణ కరువు



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అయిజ: జిల్లాలో ఆలయాలకు రక్షణ కరువైందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తెల్లవారు జామున మండల పరిధిలోని ఉప్పల గ్రామ సమీపంలో వినాయకుడి గుడిలో దుండగులు దాడి చేసిన నేపథ్యంలో బీజేపీ నాయకులు గుడిని సందర్శించారు. ఆలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నాగర్‌దొడ్డి, పెద్దదిన్నె గ్రామాల్లోని శివాలయాల్లో, భాగ్యనగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో దాడులు జరిగాయని, పలు విగ్రహాలను ధ్వంసం చేశారన్నారు. పలు ఆలయాల్లో హుండీలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్నాయని ఆరోపించారు. దాడులు, దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించి శిక్ష విధించాలని, ఆలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా బస్టాండ్



ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

అలంపూర్: ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారిందన్నారు. ఆవరణలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు విస్తృతంగా పెరిగాయన్నారు. మూత్రశాలలు లేక ఆవరణలోనే బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులు విసర్జన చేస్తున్నారన్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉండటంతో కోర్టు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున వస్తున్నారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి బస్టాండ్‌లో వసతులు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ నుంచి మరుగుదొడ్ల నిర్వాహణకు కాంట్రాక్టర్‌కు నెలకు రూ.25 వేలు ఇస్తున్నా కాంట్రాక్టర్ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో వసతులు కల్పించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంటస్వామి, నాగరాజు, జయన్న, రంగన్న, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

రాజోళి చరిత్రను దిగజారుస్తున్నారు



రాజోళి బస్టాండ్ వద్ద కేవీపీఎస్ నాయకులు

రాజోళి: రాజులు ఏలిన రాజోళి చరిత్రను నాయకులు దిగజారుస్తున్నారని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కేవీపీఎస్ నాయకులు పలు సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌ను పట్టించుకున్న నాథుడే లేడని మండిపడ్డారు. 2009లో వరదల కారణంగా నిర్మించ తలపెట్టిన నూతన గృహాల్లో నేటి వరకు వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో ప్రధాన రోడ్లు, కూడళ్లపై మూత్రశాలలు కూడా లేవన్నారు. తక్షణమే బస్టాండ్‌లో వసతులు కల్పించాలని పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



పెద్దదిన్నెలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇటిక్యాల/మానవపాడు: మండల పరిధిలోని పెద్ద దిన్నే ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

■ మానవపాడు మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎస్ఓ జ్యోతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, కోలాటలు, నృత్యాలతో సంబరంగా చేశారు.



పెద్దదిన్నెలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



మానవపాడు కేజీబీవీలో బతుకమ్మ వేడుకలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



చాగాపురంలో సభ్యత్వాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఇటిక్యాల: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని (టీపీయూఎస్) తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2010 సంవత్సరానికి ముందు ఉద్యోగంలో ప్రవేశించిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. టెట్ పరీక్ష నుంచి ఉపశమనం కలిగేలా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉపాధ్యాలకు మేలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు మురళి, జగన్, రవి, రంగస్వామి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఉపాధ్యాయులు, విద్యార్థులతో వైద్య సిబ్బంది

అలంపూర్‌రూరల్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డాక్టర్ ప్రసన్నరాణి అన్నారు. స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ పరీక్షలు, బరువు తక్కువ ఉన్న చిన్నారులకు రక్తహీనతతో ఉన్న కిశోర బాలికలు, పరీక్షలు చేసి టీకాలు వేశారు. అనంతరం మానసిక వ్యాధిగ్రస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు అమీర్, ఉస్సేన్, వైషేక్, మహేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



ఆత్మకూర్: ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండాపురం బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

శాంతినగర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ రమా ఓబులేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతిదేవికి పూజల అనంతరం వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులే విద్యార్థులకు రక్ష అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు ఏడుకొండలు, రాఘవేందర్, జీవ జయరాజు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



అయిజ: పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా జీవిస్తామని మున్సిపల్ ఇన్విరాన్మెంటల్ ఇంజినీర్ సురేష్ అన్నారు. స్వచ్ఛతోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అదే విధంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చుదాం



అయిజ: జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చుదామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. ఎమత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా 100, 1099 తదితర నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

గద్వాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీల్లో భాగంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేసి నిరుద్యోగ భృతి ఇవ్వాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కన్వీనర్ ఉప్పేర్ అంజి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏఓ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తక్షణమే భృతిని అందించాలని కోరారు. కార్యక్రమంలో కొండల్, అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం

అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో శుక్రవారం రాత్రి పోలీస్ కళా బృందం సభ్యులు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు ఎస్ఐ తరుణ్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రత, సైబర్‌మోసాలు, డ్రగ్స్ వాడకం వలన కలిగే నస్టాలపై వివరించారు. బాలికలను వేధిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కళా బృందం సభ్యులు కేశవరావు, రాధమ్మ, రామాంజనేయులు, షీటీం కానిస్టేబుల్ యశ్వంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీసన్న కుటుంబానికి న్యాయం చేయాలి

గద్వాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన దాసరి బీసన్న కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఓ ఫోర్ వీలర్ కంపెనీ షాపు వద్ద దాసరి బీసన్న కుటుంబం చేస్తున్న ఆందోళన శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. తక్షణమే యాజమాన్యం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విగ్రహం ధ్వంసంపై కేసు నమోదు



అయిజ: మండలంలోని ఉప్పల శివారులోని వినాయకుడి ఆలయంలో హుండీ పగులగొట్టి చోరీ, సాయిబాబా విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అదనంగా బస్సులు నడపాలి

గద్వాల: జిల్లా కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం అదనంగా బస్సులు నడపాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య డిపో సూపర్‌వైజర్ విజయ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వివిధ పాఠశాల, కళాశాలలకు బస్సుల్లో వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని బస్సు సర్వీసులు పెంచాలని పేర్కొన్నారు.

ఎక్స్‌పోకు తరలిన ఫొటోగ్రాఫర్లు

గట్టు: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి మండల ఫొటోగ్రాఫర్లు శుక్రవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ఉపాధ్యక్షుడు కమ్మరి వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారులను బడి మాన్పించొద్దు



గట్టు: బడిఈడు పిల్లలను బడి మాన్పించి పనుల్లో పెట్లవద్దని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నల్లారెడ్డి చిన్నారుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నల్లగట్టుతండా సమీపంలో పొలం పనులు చేస్తున్న 9 మంది చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నల్లారెడ్డి మాట్లాడుతూ.. చదువుకునే వయస్సున్న పిల్లలను పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమన్నారు. 14 ఏళ్లలోపు చిన్నారుల చేత పనులు చేయించవద్దని వారని పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శ్రీధర్, అంగన్వాడీ టీచర్ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి– జూరాల మధ్య వంతెన నిర్మించాలి

గద్వాల: కృష్ణానదిపై హైలెవల్ వంతెనను కొత్తపల్లి– జూరాల గ్రామాల మధ్య నిర్మించాలని కోరుతూ కొత్తపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రంలో శుక్రవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంత మంది నాయకులు రాజకీయం చేయడంతో మా గ్రామాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, బీజేపీ పట్టణ అధ్యక్షుడు విజయ్, బీఆర్ఎస్ నాయకులు హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడు మండలం జల్లాపురానికి చెందిన మద్దిలేటికి రూ.39 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కరుణసింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భారం తగ్గించాలి



మానవపాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల అద్దె తగ్గించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 36 కుటుంబాలు షాపులు ఏర్పాటు చేసుకొని అద్దె వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే అద్దె భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, మధు, సుధాకర్, ప్రభాకర్, రామకృష్ణ, వలి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



అయిజ: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు కార్మికులను ఆదేశించారు. శుక్రవారం ఎస్సీ కాలనీలో మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో మురుగు కాల్వల్లో పూడిక తీయాలని, బ్లీచింగ్ చేయాలన్నారు. మురుగు కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. దోమలు, ఈగల వ్యాప్తి పెరగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పశువైద్య శిబిరం ఏర్పాటు



గట్టు: మండల పరిధిలోని రాయాపురంలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాయాపురం, ఆరగిద్ద గ్రామాల్లో పశువులు రోగాల బారిన పడి మృతి చెందుతున్నట్లు పశు యజమానులు, రైతులు ఆందోళన చేసిన నేపథ్యంలో అధికారులు ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకుతున్నట్లుగా గుర్తించారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పృధ్వీరావు, కనకరాజు, ఖాజా, గోపాలమిత్రలు ఉరుకుంద, పరమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సేవలు అందించాలి



అలంపూర్: ప్రమాద బాధితులకు 108 అంబులెన్స్ సేవలు సత్వరమే అందించాలని జిల్లా కోఆర్డినేటర్ రత్నయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో 108 అంబులెన్స్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. వివిధ పరికరాలను పరిశీలించి వాటి పనితీరు, మందు వివరాలు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఎంటీ శివశంకర్, పైలట్ శ్రీశైలం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల రిమాండ్‌కు తరలింపు

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండాకు చెందిన ఈరమ్మ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసులో మద్దెలబండ తండాకు చెందిన నారాయణనాయక్‌ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా మల్లాపురంలో రెండు నెలల క్రితం జరిగిన చోరీ కేసులో వీరేష్, కృష్ణను అదుపులోకి తీసుకొని తులం బంగారం రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.